**ఆదర్శం.. అంకాపూర్**







**కార్మిక సంఘాల ఆందోళన**

AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## 'పది' పరీక్షల్లో 49మంది విద్యార్థుల గైర్హాజరు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. పరీక్షల్లో భాగంగా సోమవారం థర్డ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లావ్యాప్తంగా 24,395 మంది విద్యార్థులకు గాను.. 24,346 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లు డీఈవో అశోక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారన్నారు. అలాగే డీఈవోగా తాను తొమ్మిది కేంద్రాలను తనిఖీ చేశానని.. జిల్లా అబ్జర్వర్లు 8 కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 38 కేంద్రాలను, ఈసీజీఈ బృందాలు మూడు కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్‌లు 144 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశాయన్నారు.



## తగ్గుతున్న బంగారం ధరలు




**అక్షరటుడే, కామారెడ్డి:** పసిడి ధరలు తగ్గుముఖం పట్టాయి. కొద్దిరోజులుగా అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో పుత్తడి ధరలు దిగి వస్తున్నాయి. దీంతో కొనుగోలుదార్లకు పెద్ద ఊరట లభిస్తోంది. గత రెండు మూడు రోజుల్లో భారీగా తగ్గింది. సోమవారం ఉదయం కామారెడ్డిలో తులం బంగారం ధర రూ.1,38,500లకు చేరింది. బంగారం ధర ఒక్కసారిగా తగ్గుముఖం పట్టడంతో కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. బంగారం ధరలతో పాటు వెండి ధర కూడా దిగివచ్చింది. తులం వెండి ధర ప్రస్తుతం రూ.2,150గా ఉంది. కాగా.. మధ్యాహ్నం తర్వాత బంగారం ధర పెరిగి రూ. 1.46 లక్షలకు పెరిగింది.

## ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో బడ్జెట్‌కు ఆమోదం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ బడ్జెట్ సమావేశాన్ని మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 6.02 కోట్ల బడ్జెట్‌కు నూతన పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఇంటి పన్ను, కుళాయి పన్ను, వ్యాపార పన్ను, ప్రభుత్వ నిధులనుంచి వచ్చే ఆదాయాలతో కలిపి ఈ బడ్జెట్‌నూ రూపొందించి ఆమోదించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి మున్సిపాలిటీకి వచ్చే నిధులతో అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ భాగ్యమ్మ, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ మహేష్, అధికారులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్ల సమ్మెకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు: బిగాల



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఆశా వర్కర్ల సమ్మెకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో సోమవారం ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశా వర్కర్లు చేస్తున్న న్యాయమైన సమ్మెకు పూర్తి మద్దతు ఇస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఆశా వర్కర్ల జీతాలను రూ.18,000కు పెంచుతామని హామీ ఇచ్చిందని, కానీ ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా పెంచకపోవడం దురదృష్టకరమని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి అధికారంలో ఉన్న సమయంలో ఆశావర్కర్ల జీతాలను రూ.2,200 నుంచి రూ.9,750 వరకు పెంచారని బిగాల గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం మాత్రం వారి సమస్యలను పూర్తిగా విస్మరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రతి మహిళా దినోత్సవం సందర్భంగా ఆశా వర్కర్లకు చీరలు, భోజనాలతో గౌరవంగా సన్మానం చేసిన విషయాన్ని తెలిపారు. అయితే ప్రస్తుతం ఆశా వర్కర్లను పట్టించుకునే పరిస్థితి లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సుజిత్‌సింగ్ ఠాకూర్, చింతకాయల రాజు, రంగు సీతారాం పాల్గొన్నారు.



# సూత్రధారులు తేలేనా?

- ఏసీబీ దాడులు జరిగి వారం రోజులు
- పెట్రోల్, డీజిల్ డబ్బులు నొక్కేసిందెవరో..
- చర్యలు తీసుకోకుండా ఓ అధికారి పైరవీలు

**కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఇటీవల దాడులు చేశారు. పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. అయితే అసలు సూత్రధారులు ఎవరో మాత్రం తేల్చలేదు. దీంతో అవినీతికి పాల్పడిన అధికారులు ఎవరు, వారిపై చర్యలు ఉంటాయ అని పట్టణ ప్రజలు చర్చించుకుంటున్నారు.**

**- అక్షరటుడే, కామారెడ్డి**

మున్సిపల్ కార్యాలయంలో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగినట్టుగా ఏసీబీ సోదాల్లో తేలింది. అవకతవకలపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఏసీబీ పేర్కొంది. గత సోమవారం అధికారులు దాదాపు 8 గంటల పాటు కార్యాలయంలో సోదాలు చేశారు. మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ శాఖల్లో భారీగా అవినీతి చోటు చేసుకున్నట్టుగా గుర్తించారు. అయితే ఇందులో ఎవరిపై చర్యలు ఉంటాయో తెలియడం లేదు. అసలు సూత్రధారులు ఎవరో అధికారులు తేలుస్తారా.. లేక నివేదికతో సమర్పించి ఊరుకుంటారా అనేది తెలియాల్సి ఉంది.

### కార్మికుల జీతాలు సైతం

కామారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ విభాగంలో పని చేస్తున్న కొందరు కార్మికుల జీతాలను సైతం అవినీతి అధికారులు వదలలేదు. నెలలో సగం రోజులు పని చేసినా పూర్తిస్థాయి వేతనం చెల్లించినట్టుగా రికార్డుల్లో నమోదు చేశారు. కార్మికులకు సగం జీతమే ఇచ్చి.. మిగతా సగం నొక్కేశారు. ఆ అధికారులు ఎవరో తెలియాల్సి ఉంది.

### పెట్రోల్, డీజిల్ డబ్బులు

కామారెడ్డి మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన వాహనాలకు పెట్రోల్, డీజిల్ కోసం ప్రతి నెల రూ.12.40 లక్షలు చెల్లిస్తున్నారు. అయితే వాహనాలకు డీజిల్, పెట్రోల్ కోసం రూ.12.40 లక్షల ఖర్చు అయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. నడవని వాహనాలకు సైతం పెట్రోల్ డీజిల్ ఖర్చు చేసినట్టుగా చూపించి ఆ డబ్బులు వాడుకున్నట్టుగా సమాచారం. అయితే రూ.12.40 లక్షల ఖర్చులకు సంబంధించి లాగ్ బుక్కులు నిర్వహించకపోవడం అనుమానాలకు

### పైరవీలు షురూ..?

అధికారులు మూకుమ్మడిగా అవినీతికి పాల్పడ్డటుగా తెలుస్తోంది. దాడులు జరిగిన రోజు కార్యాలయంలో కమిషనర్, టీపీవో, రెవెన్యూ ఆఫీసర్ లేకపోవడంపై ఏసీబీ అధికారులు ఆరా తీసినట్టుగా తెలిసింది. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున డబ్బులు పోగేసిన అధికారులు నాయకుల వద్దకు వెళ్లి తమపై చర్యలు తీసుకోకుండా కాపాడాలని పైరవీలు చేస్తున్నట్లు సమాచారం. ఏసీబీ దాడుల నివేదిక ప్రకారం ప్రభుత్వం విచారణ చేపడితే సదరు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నాయి. అలా జరగకుండా ఉండేందుకు పెద్దఎత్తున లాబీయింగ్ చేస్తున్నట్టుగా సమాచారం. అలాగే ఫిర్యాదుదారులను సైతం మచ్చిక చేసుకునేందుకు యత్నిస్తున్నట్లు తెలిసింది.

## బడ్జెడ్‌లో ఆరు గ్యారెంటీలకు నిధులు శూన్యం: మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

**అక్షరటుడే, కామారెడ్డి:** ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు శూన్యమని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. పట్టణంలోని తన నివాసంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో ఏంటి.. ఇప్పుడు చేస్తుందేంటో చెప్పాలని గంప గోవర్ధన్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధిష్టానం ఆరు గ్యారెంటీలను చట్టం రూపంలో అమలు చేస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లకు చేరినా మూడు బడ్జెట్లలో ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించలేదని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు 50 శాతం కూడా రుణమాఫీ చేయలేదని.. వంద శాతం చేసినట్లు నిరూపిస్తే తాము ముక్కు నేలకు రాస్తామని చెప్పారు. రుణమాఫీ లేదని, 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.2500, పింఛన్ల పెంపు, ఆటో కార్మికులకు రూ.12 వేల సాయం, రైతు కూలీలకు రూ.12 వేలు, విద్యార్థినులకు స్కూటీ,



నిరుద్యోగులకు రూ.4 వేల భృతి, విద్యార్థులకు చదువుల కోసం రూ.5 లక్షల సాయం హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బడ్జెట్‌లో పెంచిన పింఛన్లకు ఒక్క రూపాయి కేటాయించలేదని మాజీ ఎమ్మెల్యే విమర్శించారు. రెండున్నరేళ్లలో ఒక్క కొత్త పింఛన్ ఇవ్వలేదన్నారు. చివరికి రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇచ్చే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, పార్టీ నాయకుడు కుంబాల రవి యాదవ్ పాల్గొన్నారు.



## డీఐఈవోకు సన్మానం

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలోని జూనియర్ కళాశాలలో డీఐఈవో రవికుమార్‌ను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపల్ జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం సభ్యులు అధికారిని సత్కరించారు. కార్యక్రమంలో ఐలాపూర్ ప్రిన్సిపాల్ చిన్నయ్య, డిచ్‌పల్లి ప్రిన్సిపల్ చంద్ర విఠల్, కమ్మర్‌పల్లి జూనియర్ కళాశాల అధ్యాపకులు మధు కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ కమ్మర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సొంత భవన నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలోనే నిర్మాణం ప్రారంభమవుతుందన్నారు.



## ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఈ మేరకు సోమవారం పలువురు బాధితులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. సంబంధిత అధికారులు అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను వెనువెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజావాణి కార్యక్రమానికి 140 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, డీఆర్డీవో సాయాగౌడ్, ఆర్డీవో రాజేంద్ర కుమార్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇందూరుపై సీఎం సవతి తల్లి ప్రేమ: దినేష్ కులాచారి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఇందూరుపై సీఎం రేవంత్‌రెడ్డి సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారని.. బడ్జెట్‌లో ఇందూరుకు అన్యాయం చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఇందూరుకు మణిహారమైన ఎన్ఎస్ఎఫ్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు అడుగులు ముందుకు వేయట్లేదని దినేష్ కులాచారి ప్రశ్నించారు. బడ్జెట్‌లో ఫ్యాక్టరీకి రూ.300 కోట్లు మంజూరు చేయలేదన్నారు. కొన్నేళ్లుగా జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్ట్ అంటూ ఊరిస్తున్నారని.. కనీసం రూ.100 కోట్లు ఇవ్వలేకపోయారని ఆయన ఎద్దేవా చేశారు. బైపాస్ రోడ్డుకు రూ.50కోట్లు మంజూరు చేయలేదన్నారు. పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం కూడా చెల్లించలేదని దినేష్ కులాచారి ఆరోపించారు. జిల్లా కేంద్రంలో మాధవనగర్, అర్సపల్లి ఆర్‌వోబీలకు నిధులు ఇవ్వకపోవడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. ఇందూరుపై రేవంత్ రెడ్డి సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. జిల్లావ్యాప్తంగా కలెక్టరేట్‌ను ముట్టడించేందుకు వస్తున్న ఎంతోమంది బీజేపీ నాయకులు, కార్యకర్తలను పోలీసులు బైండోవర్ చేశారని.. అయినప్పటికీ విజయవంతంగా కార్యక్రమం పూర్తి చేశామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు గల్ఫ్ కార్మికులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. గల్ఫ్ కార్మికులకు రూ.500 కోట్లు కూడా మంజూరు చేయలేని పరిస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. జిల్లా నుంచి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న మహేష్ కుమార్ గౌడ్ ఇందూరుకు ఒక్కరూపాయి కూడా మంజూరు చేయించకపోవడం సిగ్గుచేటని దినేష్ కులాచారి వ్యాఖ్యానించారు. దీనిని భారతీయ జనతా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఆయన పేర్కొన్నారు.

## సీసీ కెమెరాల నిఘాలోనే పరీక్ష పత్రాల బండిళ్లు తెరవాలి



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్ :** సీసీ కెమెరాల నిఘాలోనే పరీక్ష పత్రాల బండిళ్లు తెరవాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. పదో తరగతి పరీక్షా కేంద్రాలను ఆమె సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని మాణిక్ భవన్ పాఠశాలతో పాటు నలంద హైస్కూల్ ఎగ్జామ్ సెంటర్లను కలెక్టర్ సందర్శించారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరు, సిబ్బంది హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే నిర్ణీత సమయంలో ప్రశ్నాపత్రాలను తెరిచారా? అని అడిగి తెలుసుకున్నారు. తప్పనిసరిగా సీసీ కెమెరా రికార్డింగ్ నడుమ ప్రశ్న పత్రాల బండిల్ సీళ్లు తెరవాలని సూచించారు. ఈ మేరకు నిబంధనలు పాటించారా లేదా అని సీసీ ఫుటేజీల పరిశీలన ద్వారా కలెక్టర్ నిర్ధారణ చేసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ఆరోగ్య కార్యకర్త అందుబాటులో ఉన్నారా లేదా అని గమనించారు. ఎగ్జామ్ హాల్‌లోకి సిబ్బంది ఎవరైనా సెల్‌ఫోన్లతో వచ్చారా అని కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. ఎక్కడ కూడా కాపీయింగ్‌కు ఆస్కారం ఉండకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కాపీయింగ్‌కు ఆస్కారం కల్పిస్తే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు. పరీక్షలు ముగిసేంత వరకు అప్రమత్తతతో పకడ్బందీగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రశ్నాపత్రాలను తప్పనిసరిగా తగిన పోలీసు బందోబస్తు మధ్య కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి తప్పిదాలకు అవకాశం ఇవ్వకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు జె.శంకర్, టి.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



## శనగ, సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

**అక్షరటుడే, కోటగిరి :** పోతంగల్ మండల కేంద్రంలోని విశాల సహకార పరపతి సంఘం సొసైటీ రైస్‌మిల్ ఆవరణలో సోమవారం శనగ, సన్ ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్నిప్రారంభించారు. ఏఎంసీ ఛైర్మన్ గైక్వాడ్ హన్మంత్ రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గైక్వాడ్ హన్మంత్ మాట్లాడుతూ.. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ కొనుగోలు మద్దతు ధర శనగ క్వింటాలుకు రూ.5875. సన్‌ఫ్లవర్ ధర రూ.7,721 ఉంటుందని అన్నారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాలను విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. మండలంలోని సుంకిని, సోంపుర్, టాక్లి, గ్రామాల్లో కాంటాలు నిర్వహిస్తామని, సంఘం పరిధిలో గ్రామాల రైతులు సొసైటీలో కూడా కాంటా నిర్వహిస్తామని వీలున్న వాళ్లు అక్కడికి కూడా శనగ, సన్ ఫ్లవర్, తీసుకెళ్లవచ్చని సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోకూడదని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కల్లూరి సంధ్య హన్మాండ్లు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు షాజి పటేల్, నాయబ్ తహశీల్దార్ హజీజ్, సంఘం పీఏసీ ఛైర్మన్ రియాజుద్దీన్, రమేష్ సెట్, ఇన్‌ఛార్జి కార్యదర్శి, శివాజీ, ఓమన పటేల్, నాగేష్, ధన్‌రాజ్ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు అన్యాయం చేస్తున్న ప్రభుత్వం



**అక్షరటుడే, కామారెడ్డి:** బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా ప్రభుత్వం బీసీలను మోసం చేస్తోందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు తాహెర్ అన్నారు. బడ్జెట్‌లో బీసీలకు 12 శాతం నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ సోమవారం టీఆర్పీ ఆధ్వర్యంలో పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తాహెర్ మాట్లాడుతూ.. కామారెడ్డి గడ్డ మీద బీసీ డిక్లరేషన్ ప్రకటించారని, ఏటా రూ.20వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి తుంగలో తొక్కారన్నారు. బీసీ ప్రభుత్వం అని చెబుతూ బీసీలకు మొండిచేయి చూపిస్తోందని విమర్శించారు. బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాల్సిందేనన్నారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కల్లెం రాజు, రైతు విభాగా అధ్యక్షుడు సిద్దయ్య, శ్రీనవాస్, రాజకుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులకు ఆ గ్రామం పెట్టింది పేరు.. పంటలు, కూరగాయల సాగు, విత్తన శుద్ధి కేంద్రాలు, అందమైన భవనాలతో దేశంలోనే ఆదర్శ గ్రామంగా నిలుస్తోంది అంకాపూర్. ఊరంతా ఒక్క మాటపై ఉండటం, అభివృద్ధి కోసం అంతా ఏకమై నిలవడం ఆ ఊరి ప్రత్యేకత.

– అక్షరటుడే, ఆర్మూర్




# ఆదర్శం.. అంకాపూర్..

■ ముఖ్యమంత్రుల నోట అంకాపూర్ మాట.. ■ ఊరంతా ఒక్కమాటపై నిలబడి నిర్ణయాలు ■ ఆధునిక వ్యవసాయ పద్ధతులతో సాగు..

సాగులో ప్రత్యేకంగా నిలుస్తూ కొన్నేళ్లుగా అంకాపూర్ గ్రామం దేశంలోనే ప్రత్యేకంగా నిలుస్తోంది. గ్రామ సమస్యలను పరిష్కరించుకుంటూ, ఆదాయ మార్గాలను పెంచుకుంటూ వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల్ని అందిపుచ్చుకొని వ్యాపారంలో రాణిస్తూ దేశానికే పొలంబడి పాఠాలు చెప్పే స్థాయికి ఈ గ్రామం ఎదిగింది. అద్భుతమైన భవంతులు రేంజ్ రోవర్ కార్లు, ఇంటింటికి ట్రాక్టర్లు ఇలా అన్నింటి ఆదర్శమై జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించింది.

### వ్యవసాయమే ప్రధానం..

అంకాపూర్‌లో 1,400 పైచిలుకు కుటుంబాలు ఉండగా.. 4వేల వరకు జనాభా ఉంది. వ్యవసాయదారులే అధికం. ప్రతివీధిలో పెద్దపెద్ద భవనాలు ప్రతి ఇంటికి ఎదుట కారు ట్రాక్టర్ కనిపిస్తాయి. పంటల సాగుతో పాటు కూరగాయలు ప్రసిద్ధి. కొత్తిమీర, పుదీనా, మెంతికూర, టమాట, చిక్కుడుకాయ, వంకాయ, బీరకాయ, క్యాబేజీ, మిరపకాయ అధికంగా పండిస్తారు. అంకాపూర్ నుంచి నాగ్‌పూర్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, విజయవాడ,విశాఖపట్నం, తదితర ప్రాంతాలకు



ఎక్కువగా కూరగాయలు రవాణా చేస్తారు.

### 34 విత్తన శుద్ధి కేంద్రాలు..

మరోవైపు అంకాపూర్‌లో 34వరకు విత్తన శుద్ధి కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాలు రైతుల ఆధ్వర్యంలో నడుస్తాయి. ఒక్కో కేంద్రంలో ప్రతి ఏడాది మూడు నుంచి నాలుగు కోట్ల వ్యాపారం జరుగుతుంది. ఏడాదికి సుమారు రూ.100 కోట్లకు పైగా వ్యాపారం అవుతుంది. ఇతర రాష్ట్రాలకు విత్తనాలను ఎగుమతి చేస్తారు. వానాకాలంలో నాలుగు నెలల పాటు పచ్చి మొక్కజొన్న వ్యాపారం జోరుగా సాగుతోంది.

### అంకాపూర్ చికెన్ ఫేమస్..

మరోవైపు అంకాపూర్ నాటుకోడి చికెన్‌కు అత్యంత ప్రసిద్ధి. ఆర్మూర్ ప్రాంతానికి ఎవరు వచ్చినా అంకాపూర్ దేశీ చికెన్ తినేందుకు ఇష్టపడతారు. దీంతో ఇక్కడ కోళ్ల పెంపకం కూడా అధికంగా ఉంటుంది. గ్రామంలో వ్యవసాయ పనిలో పురుషుల కంటే రెండింతలు మహిళల పాత్ర ఉంటుంది. ఇక్కడ జరుగుతున్న ఆధునిక వ్యవసాయ పద్ధతులను తెలుసుకోవడానికి వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి రైతులు గ్రామానికి వస్తుంటారు.

### రేవంత్ రెడ్డి నోట అంకాపూర్...

అసెంబ్లీ సమావేశాల్లో సీఎం రేవంత్ రెడ్డి అంకాపూర్ గొప్పతనంపై సభలో ప్రస్తావించారు. మారుతి కార్లు వచ్చినప్పుడు గ్రామం మొత్తం కార్లు కొనుగోలు చేసిన గొప్ప గ్రామం అంకాపూర్ అని, కమర్షియల్ క్రాఫ్ట్ పండించడంలో, రైతులు పండించిన పంటలతో రైతులు శ్రీమంతులు అయ్యారని తెలిపారు. అంకాపూర్ దేశీ చికెన్ గురించి తమకు బాగా తెలుసన్నారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా పలుమార్లు అంకాపూర్ గురించి ప్రస్తావించారు.

## ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ప్రచారం




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు. సోమవారం నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం 28వ తేదీ వరకు వరకు జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం బాలాజీ నగర్ తండా, కోకొండ గ్రామాల్లో అడ్మిషన్ కంపెయింగింగ్‌కు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్ర కాంత్ డాక్టర్ గంగా రెడ్డి, జి. సిద్ధు రాజు, కృష్ణ ప్రసాద్, దశరథం, మహమూద్ అధ్యాపకులు పాల్గొన్నారు.



## బీజేపీ నాయకుల అరెస్ట్

**అక్షరటుడే, కామారెడ్డి:** బీజేపీ అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. బీజేపీ నాయకులను ఎక్కడికక్కడ ఉదయమే అరెస్ట్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా సోమవారం అసెంబ్లీ ముట్టడికి రాష్ట్ర నాయకత్వం పిలుపునిచ్చింది. ఈ క్రమంలో ముందస్తుగా నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రభుత్వంపై తమ పోరాటం ఆగదన్నారు. అరెస్టులతో తమ పోరాటాన్ని ఆపలేరన్నారు. అరెస్ట్ అయిన వారిలో కౌన్సిలర్లు నరేందర్ రెడ్డి, కైరా రాహుల్ గౌడ్, భాను ప్రకాష్, ఇతర నాయకులు ఉన్నారు.



## నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** భిక్కనూరు గ్రామ పంచాయతిని డీఎల్‌పీవో సురేందర్ సోమవారం సందర్శించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నూతనంగా నిర్మిస్తున్న మహిళా భవనం, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త ఇళ్లకు సంబంధించిన ఇంటి నెంబర్లను పరిశీలించారు. నిర్మాణాలు తరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చాకలి సాయిలు, ఉపసర్పంచ్ మ్యాతరి ఆంధ్రయ్య, వార్డ్ మెంబర్లు, పంచాయతీ కార్యదర్శి స్వప్న, కారోబార్ రాజు, ఎఫ్ఏ బాగయ్య , గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## శివాపూర్‌లో వైద్య శిబిరం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని శివాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం ఆరోగ్య వైద్యశిబిరం నిర్వహించారు. ఆరోగ్య కార్యకర్త స్వరూప గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను అందజేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఎండలో బయటకు వెళ్లిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. కలుషిత నీరు సరఫరా కాకుండా చూడాలని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఇందులో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలి



**అక్షరటుడే, కోటగిరి :** అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్న రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ బాన్సువాడ నియోజకవర్గ నాయకులు కోనేరు శశాంక్ కోరారు. ఈ మేరకు కోటగిరి తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి, సర్పంచ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైస్ మిల్లుల నిర్మాణాల్లో ఎలాంటి నిబంధనలు పాటించడం లేదన్నారు. రైస్ మిల్లుల ఆవరణలో పార్కింగ్ ప్లేస్ ఉండకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మండలంలో కొత్తగా నిర్మిస్తున్న రైస్‌మిల్లులను అధికారి తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోటగిరి, రుద్రూర్ మండలాల బీజేపీ అధ్యక్షుడు నవీన్, హరి, జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రశాంత్ గౌడ్, సీనియర్ నాయకులు పుల్లెల మోహన్ రావు, నాగెల్లి శ్రీనివాస్, వడ్ల శ్యాం, మామిడి శీను, గుంజరి జగదీష్,మామిడి సాయిలు, విలాస్, శ్యాం, ఒమన్న పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల ధర్నా

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** మున్సిపల్ కార్మికులపై అధికారుల వేధింపులను నివారించాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని, తక్షణమే వేతనాలు చెల్లించాలని టీయూసీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట కార్మికులు ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్ మాట్లాడుతూ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులపై అధికారుల వేధింపులను అరికట్టాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని అడిగితే కేసులు పెట్టడం సరికాదన్నారు. వెంటనే ఈ అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఏజెన్సీ కార్మికులకు వేతనాలు ఇచ్చి, సీఐజీ గ్రూప్‌ల కార్మికులకు ఇవ్వకపోవడం అధికారుల కక్షపూరిత వైఖరికి నిదర్శనమన్నారు. మున్సిపల్ కార్మికులకు రేపటిలోగా వేతనాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే ఉన్న సీఐజీ గ్రూప్‌లను కొనసాగిస్తూ, అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ కార్మికులను గ్రూప్‌లుగా చేయాలన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికులందరికీ




యూనిఫామ్, సబ్బులు, నూనెలు, రక్షణ పరికరాలు ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు ఇవ్వాలన్నారు.సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ బాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, నాయకులు కిరణ్, రవి, యాదమ్మ, శాంతికుమార్, విజయ్, గంగాధర్, లక్ష్మి, శైలజ, నవీన్, నరేష్, రాము, మహిపాల్, సహదేవ్, వినోద, మాధవి, సాయిలు, వినోద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వేంపల్లిలో అభివృద్ధి పనుల పరిశీలన



**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండలం వేంపల్లి గ్రామంలో డ్రెయినేజీలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, నర్సరీలను ఎంపీడీవో రమేష్ సోమవారం ఉదయం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించి, పనులను నాణ్యతతో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎట్టెం మహేష్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ జగదీష్, రామకృష్ణ, బట్టు రాజేశ్వర్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో బలిదాన్ దివస్




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఇందూర్ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని గిరిరాజ్ డిగ్రీ కళాశాలలో బలిదాన్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిరాజ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్, ప్రాణత్యాగాలను మనం అనునిత్యం గుర్తుచేసుకోవాలన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ఈ దేశం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృత్ చారి గారు మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇందూరు జిల్లా కన్వీనర్ అక్షయ్, దుర్గాదాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## కోటగిరి గీత పారిశ్రామిక సహకార సంఘంలో అవినీతి : టీసీఎస్ అధ్యక్షుడు

**అక్షరటుడే,కోటగిరి :** కోటగిరి గీత పారిశ్రామిక సహకార సంఘంలో అవినీతి చోటు చేసుకుందని టీసీఎస్ అధ్యక్షుడు శంకర్ గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు కోటగిరిలో గీత పరిశ్రమ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడుతున్న మేనేజ్‌మెంట్ , క్యాషియర్‌పై అధికారులు చట్టరీత్యా చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోటగిరి సహకార సంఘం గ్రూప్ సొసైటీ రిజిస్ట్రేషన్ నం. 242 సొసైటీలో 60 కల్లుగీత కార్మికుల కుటుంబాలు ఉన్నాయన్నారు. గత రెండేళ్ల నుంచి మేనేజ్‌మెంట్ సభ్యులు జమా ఖర్చులు చూపకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. గత రెండేళ్ల నుంచి రూ.లక్షల్లో దోచుకుని దాచుకున్నారని ఆరోపించారు. షేర్ పార్టనర్లకు లెక్కలు చెప్పకుండా అడిగిన వారిపై దౌర్జన్యం చేస్తూ ఇటు గీత కార్మికుల అటు సొసైటీ సభ్యులకు విభజించి పాలిస్తున్నారని శంకర్ గౌడ్ ఆరోపించారు. నష్టాలు, లాభాలు చూపించకుండా సొసైటీ సభ్యులకు డబ్బులు పంచకుండా రోజువారీగా వచ్చిన డబ్బులతో విలాసమైన జీవితాలు గడుపుతున్నారని ఆరోపించారు. అవినీతికి పాల్పడుతున్న తండ్రీకొడుకులపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని కోరుతూ నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు లిఖితపూర్వంగా ఫిర్యాదు చేస్తామని తెలిపారు. నేటి నుంచి కోటగిరి గీత పరిశ్రమ సహకార సంఘం గ్రూప్ సొసైటీ పాలకవర్గం ద్వారా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు ఏ.విఠల్ గౌడ్, టీసీఎస్ ఉపాధ్యక్షులు అరుణ్‌కుమార్ గౌడ్, కార్యదర్శి ఎస్.సాయిబాబా గౌడ్, గౌడ సంఘం నాయకులు ఆర్. శ్యాం సుందర్ గౌడ్, ఆర్.రమేష్ గౌడ్, ఎం.నాగాగౌడ్, ఎస్.శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

